క్లుప్తంగా

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ బాపట్ల రీజియన్‌లో పర్చూరు, చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, మార్టూరు బస్‌స్టేషన్ల పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను వ్యాపార నిమిత్తం లీజుకు ఇచ్చేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చీరాల డిపో మేనేజర్ జె.శ్యామల శుక్రవారం తెలిపారు. చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని చీరాల, పర్చూరు నియోజకవర్గాలలోని బస్‌స్టేషన్‌ల్లో 22 ఓపెన్ ప్రదేశాల్లో 15 సంవత్సరాల పాటు లీజు పద్ధతిలో ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం 2గంటల్లోపు నెల్లూరు జోన్ ఈడీ కార్యాలయంలోని టెండర్ బాక్సులో వేయాలన్నారు. 3గంటలకు బిడ్స్ టెండర్ల సమక్షంలో తెరవనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 21న ఉదయం 11గంటలకు చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో ముందస్తు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఔత్సాహికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని వంకాయలపాడు గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.19,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్‌ఐ సురేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చేయూత అభినందనీయం



చెక్కు అందిస్తున్న సుబ్బారావు దంపతులు

అద్దంకి: సొంత గ్రామంపై మక్కువతో పాఠశాలలో చదివే విద్యార్థులకు చేయూతనిస్తున్నట్లు కూకట్ల ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో హెచ్‌ఎం గంగాధర్‌రావు అధ్యక్షతన శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సింగ్ కోర్సు చేస్తున్న పాఠశాల విద్యార్థులు అన్నంగి ప్రవంతి, బుసి రమ్యలకు రూ. 20 వేల చొప్పున రూ.40 వేలను ఫౌండేషన్ తరపున కూకట్ల సుబ్బారావు, వింధ్యావళి దంపతులు అందజేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులతో కళాశాల యాజమాన్య, అధ్యాపక సిబ్బంది

చీరాల రూరల్ : విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రాణహిత హాస్పిటల్ డైరెక్టర్ గద్దం సుభాషిణి అన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుభాషిణి పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, కరస్పాండెంట్ శీలం విద్యా సాగరరావులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమైనదని, ఈ దశలో విద్యపై ఆసక్తి చూపి క్రమశిక్షణతో చక్కగా చదువుకుంటే బంగారు భవిష్యత్ ఉంటుందని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డు లైబ్రేరియన్ పుల్లగుర జయశీలరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

104, 108 అంబులెన్స్‌లలో పోస్టులకు దరఖాస్తులు

చీరాల రూరల్: 104, 108 అంబులెన్స్ వాహనాల్లో డ్రైవర్లు, పైలట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాపట్ల 104 జిల్లా మేనేజర్ జె. నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్, పైలట్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని, హెవీ లైసెన్స్, 35 సంవత్సరాలు కంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని సూచించారు. అలానే ఇంగ్లిష్ చదవడం, రాయడం తెలిసి ఉండాలన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 16లోగా చీరాల ప్రభుత్వాసుపత్రిలోని 104 కార్యాలయం రూము నెంబర్-43లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 6305 359961, 83095 30078 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పంట నష్టం.. తీరని కష్టం

- చేతికందిన పంటలు నీటిపాలు
- చీరాల, వేటపాలెం మండలాల్లో వందలాది ఎకరాలకు పంట నష్టం
- ఎకరాకు రూ.40 వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలంటున్న రైతన్నలు



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న వసాయాధికారులు, శాస్త్రవేత్తలు (ఫైల్)



బుర్లవారిపాలెం ప్రాంతంలో నీటిలో మునిగిపోయిన మినుము పంట (ఫైల్)

చీరాల రూరల్: తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు రైతన్నలు భారీగా నష్టపోయారు. ఎంతోకొంత కూటమి ప్రభుత్వం అయినా ఆదుకుంటుందిలే అని అనుకుంటున్న రైతన్నల ఆశలు అడియాసలయ్యాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పంటనష్ట పరిహారం ఊసేలేదు. కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు చీరాల, వేటపాలెం మండలాల్లోని చేతికందివచ్చే పంట పొలాలు నీటిపాలయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట మొత్తం చేతికందివచ్చేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు పెట్టుబడిపోనూ ఈ ఏడాది మంచి లాభాలను చవిచూసేవారమని రైతులు ఎంతో ధీమాగా చెప్తున్నారు. అయితే వర్షాల రూపంలో తమను కోలుకోలేని దెబ్బ తీసిందని రైతులు మూగంగా రోధిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే..

చీరాల, వేటపాలెం మండలలాల్లో ఈ రబీ సీజన్‌లో రైతులు మినుము, వేరుశనగ, పంట వేశారు. చీరాల మండలంలోని గవినివారిపాలెం, బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, వాడరేవు, పాపాయిపాలెంలో గ్రామాలకు చెందిన రైతులు మినుము పంటను దాదాపు 100 ఎకరాలలో సాగుచేశారు. రైతులు ఎంతో కష్టపడి అప్పులుచేసి మరీ పెట్టుబడిపెట్టారు. ఎకరాకు రూ. 10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు చేశారు. పంటకు తీసుకోవాల్సిన అన్ని సస్య రక్షణలు తీసుకున్నారు. ఈ ఏడాది మినుము పంట విరగకాసింది. పంటలు పూర్తిగా కోత దశకు చేరుకున్నాయి. మరో వారం రోజుల్లో పంట మొత్తం ఇంటికి చేరుకోనుంది. ఈ తరుణంలో బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురవడం పంట మొత్తం నీటిలో మునిగిపోవడం జరిగిపోయింది. పంట మొత్తం ఎందుకూ పనికిరాకుండా పోయింది. అదే సక్రమంగా ఉన్నట్లయితే రైతులు పెట్టిన పెట్టుబడి పోను చేతిలో పుష్కలంగా డబ్బులు ఉండేవి. ప్రస్తుతం మినుము పంట ఈ ఏడాది మంచిగా పెరిగింది. ఎకరాకు 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చేదని రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం క్వింటా మినుము ధర మార్కెట్లో రూ.5 నుంచి రూ.8 వేలు వరకు పలుకుతుందని రైతులు అంటున్నారు. అలానే వరి సాగుచేసే రైతులు కూడా 100 ఎకరాల్లో విత్తనాలు ఎదజల్లారు. వాటి పరిస్థితి కూడా డోలాయమానంలో ఉందని విత్తనాలు మొలకెత్తితే ఎత్తుతాయి, లేదంటే అవి కూడా ఎందుకు పనికిరాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ పండించిన రైతులు ఈ ఏడాది అదృష్టవంతులని, వర్షాలు పడకముందే ఐదు రోజులు క్రితమే పూర్తిగా కోతలు కోసి పంటను మొత్తం కొందరు రైతులు పొలాల్లోనే విక్రయించుకున్నారని, మరి కొందరు రైతులు ఇళ్లకు తరలించుకున్నారని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

తూతూ మంత్రంగా పంట నష్ట అంచనాలు..

భారీ వర్షాలకు పూర్తిగా నీటిలో మునిగి ఎందుకూ పనికిరాకుండా పోయిన పంట పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఎంతమేరా నష్టం జరిగిందనే విషయాలను పూర్తిగా రైతులు నుంచి సేకరించారు. రైతుల నుంచి సేకరించిన నష్ట వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందించారు. అలానే నీటిలో మునిగిఉన్న పంట పొలాలను బాపట్ల జిల్లా వ్యవసాయ సీనియర్ సైంటిస్టులు పరిశీలించారు. పంటలకు తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను గురించి రైతులకు వివరించారు. ఏది ఏమైనా భారీ వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బ తీసిందని రైతులు రోధిస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు తమ గోడును అధికారుల వద్ద వెళ్లబోసుకుంటున్నారు. నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.40 వేల పంటనష్ట పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులకు పూర్తిగా నష్టం జరిగింది..



ఈ ఏడాది మినుము పంట బాగా పండింది. వారం రోజుల్లో పంటలను కోసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. ఈ తరుణంలో వర్షాల రూపంలో పొలాలన్ని నీటితో నిండిపోయాయి. పంటలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఒక్కొక్క రైతు పెట్టుబడిగా రూ.15 వేలకుపైగానే వెచ్చించాల్సి వచ్చింది. పెట్టిన పెట్టుబడులు రాక పోగా అప్పులు మిగులుతాయి. అలానే వంద ఎకరాలలో వరి విత్తనాలు ఎదజల్లారు. వాటి పరిస్థితి కూడా మిణుకుమిణుకు మంటుంది. వర్షాలు తగ్గకుంటే విత్తనాలు కూడా మొలకెత్తే పరిస్థితి ఉండదు. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– పిట్టు పోలయ్య, రైతు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

జే.పంగులూరు: సీపీఎం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం సీపీఎం ఉద్యమానికి కాకుండా వామపక్ష ఉద్యమానికి తీరని లోటుని ఆ పార్టీ సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు అన్నారు. పంగులూరులో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి నాగబోయిన రంగారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాయిణి వినోద్‌బాబు, మండల కార్యదర్శి తలపనేని రామారావు, నాయకులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: ఏచూరి మరణం పార్టీకి నష్టం అని సీపీఎం మండల కార్యదర్శి మొండ్రు ఆంజనేయులు అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని పార్టీ కార్యాలయంలో సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెన్నుపాటి హరిబాబు, దశరథ, కొల్లా సుబ్బారావు పాల్గొన్నారు.

చీరాల: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పట్ల డాక్టర్ బాబూ జగజ్జీవనరావు చైర్ పరిశోధకులు తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం విజయనగర్ కాలనీలోని స్కూల్‌లో విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

మార్టూరు: మార్టూరులో పార్టీ నాయకులు సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, ఎనిక పాటి రాంబాబు, బి.సూరిబాబు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో గణనాథుడు



జాతీయ జెండా రంగుల అలంకరణలో గణనాథుడు



గణనాథుడికి వాడరేవు తీరంలో వీడ్కోలు పలుకుతున్న భక్తులు

చీరాల అర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని వార్డులలో వివిధ ఆకృతుల్లో గణనాథులను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో పట్టణంలోని కస్తూరిబా గాంధీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని జాతీయ జెండా రంగులతో అలంకరించారు.

చీరాల టౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథులను వాడరేవులోని సముద్రంలో నిమజ్జనం చేస్తుండగా తీరంలో నిమజ్జనాల సందడి నెలకొంది. వాడరేవులో నిమజ్జనాల నేపథ్యంలో సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని పోలీసులు పేర్కొన్నారు.

నేడు పర్చూరులో జాతీయ లోక్ అదాలత్

పర్చూరు (చినగంజాం): జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పర్చూరు కోర్టు పరిధిలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కే ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ చేయదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమ తీర్పు అని ఆమె వివరించారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు సంబంధించి ఫీజులు తిరిగి చెల్లిస్తారన్నారు. అవకాశాన్ని అర్జీ దారులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

హిందీ భాషతో పలు ఉపయోగాలు



అద్దంకిలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్



వేటపాలెంలో హిందీ వస్తువుల ప్రదర్శనతో ఉపాధ్యాయులు



బొబ్బేపల్లిలో హిందీ కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

- ఘనంగా హిందీ భాషా దినోత్సవం

అద్దంకి రూరల్: దేశంలో హిందీ భాషతో చాలా ఉపయోగాలు ఉన్నాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కేఆర్కే కళాశాలలో జాతీయ హిందీ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ ఆర్ సైదయ్య హాజరయ్యారు. ప్రిన్సిపాల్ వేల్పూల మోహన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ హిందీ నేర్చుకోవటం వల్ల ఎన్నోలాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల హిందీ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం: మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో గల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హిందీ ప్రదర్శన ప్రారంభించారు. హెచ్‌ఎం వీ ఫణి సత్యనారాయణ మాట్లాడుతూ హిందీ ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. అక్కాయిపాలెంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భవనం భద్రిరెడ్డి, ఉపాధ్యాయులు ఖమురిన్నీసా, శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

– మార్టూరు మండలం బొబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బీ చలపతి, హిందీ పండిట్ జుబేదా బేగం విద్యార్థులకు హిందీ భాషా ప్రాముఖ్యత గురించి చెప్పారు. హిందీ భాషా వ్యాప్తి కోసం కృషి చేసిన కవులు, రచయితలు ఇతర ప్రముఖుల చిత్రపటాలను పరిచయం చేసి వారికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



ఇంకొల్లులో వరద బాధితుల కోసం నిధులు సేకరించిన విద్యార్థినులు



వలపర్లలో విరాళాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మార్టూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం విరాళాలు సేకరించారు. గ్రామంలోని వీధుల వెంట ప్రదర్శనగా బయలుదేరిన విద్యార్థులు షాపులు, దుకాణాలు గ్రామస్తుల నుంచి రూ. 13,097 విరాళాలు సేకరించినట్లు ఎన్‌సీసీ అధికారి కే వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపనున్నట్లు ఆయన తెలిపారు.

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు నల్లమోతు రామానుజమ్మ, వెంకట సుబ్బారావు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయమందించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. వరద బాధితులు సహాయార్థం వారు దాచుకున్న సొమ్ముతో పాటు మండలంలోని ఇంకొల్లు, దగ్గుబాడు, భీమవరం గ్రామాల్లో ప్రజల నుంచి చందాలు సేకరించి మొత్తం రూ.30,300 ముఖ్యమంత్రి సహాయ నిధికి శుక్రవారం పంపించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావి నాగేశ్వరి, ఉపాధ్యాయులు కుమారి, రాధారాణి, రజని తదితరులు అభినందించారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

అద్దంకి రూరల్: ప్రేమించి మోసపోయానని మనస్థాపంతో యువకుడు పురుగుల మందుతాగి వైద్యశాలలో చేరి శుక్రవారం మృతి చెందిన ఘటన పై ఎస్సై ప్రవీణ కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని కొటికలపూడి గ్రామానికి చెందిన కోటయ్య (23) అదే గ్రామానికి చెందిన ఓయువతిని ప్రేమించాడు. ఈక్రమంలో ఆయువతి వేరొకరిని ప్రేమిస్తుందని తెలుసుకున్న కోటయ్య తను మోసపోయానని మనస్థాపంతో బుధవారం అద్దంకి నుంచి కొటికలపూడి వెళ్లే దారిలో పురుగుమందు తాగి ఇంటికి వచ్చి తల్లి చెప్పాడు. తల్లి వెంటనే అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని జీజీహెచ్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఒంగోలు వైద్యశాలనుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం



శ్రీకృష్ణ దంపతులను ఘనంగా సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొడవలివారిపాలెం (కారంచేడు): ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనేది మరుపురాని ఘటనని, ప్రతి ఒక్క ఉద్యోగికి ఇది తప్పదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మండలంలోని కొడవలివారిపాలెం తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ శ్రీకృష్ణ దంపతులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంతో మంది జీవితాలకు వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మొలబంటి వెంకటేశ్వర్లు, స్వర్ణ, యర్రంవారిపాలెం, ఆదిపూడి ఉన్నత పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు ఎంవీ సుబ్బారావు, జే శేఖర్‌బాబు, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నార్తులను ఆదుకోవడం దేవుడితో సమానం



మాట్లాడుతున్న డీఎస్పీ జగదీష్ నాయక్

చీరాల రూరల్: ఆకలితో ఉన్న అన్నార్తులను ఆదుకోవడం దైవ కార్యంతో సమానమని, అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మహా గొప్పదని డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. చీరాల ప్రభుత్వ వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్లో మందులు వాడుతున్న హెచ్‌ఐవీ బాధితులకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అన్నదానానికి చైతన్య మనో వికాస కేంద్రం నిర్వాహకులు వెంకన్నబాబు ముందుకు రావడం ఎంతో మంచి పరిణామమని వెంకన్నబాబును అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ సుభాషిణి, ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీకాంత్, ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ హరిబాబు, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జానీబాషా, ఏఆర్టీ, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకరణాలు అందజేత

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో గల భవిత సెంటర్‌లోని విద్యార్థులకు గ్రామానికి చెందిన కర్నాటి వెంకట నారాయణరావు జ్ఞాపకార్థం మనవడు కర్నాటి కిషోర్ రూ.15 వేలు విలువగల ఫిజియోథెరపీ సైకిల్‌ను శుక్రవారం బహూకరించారు. అదేవిధంగా అద్దంకి కి చెందిన చెన్నుపల్లి అంజయ్య భార్య వెంకటరత్న కుమారి రూ.8 వేలు విలువ గల జంపింగ్ వాల్‌ను సెంటర్‌కు బహూకరించారు. కార్యక్రమంలో పీవీ కొండయ్య, దాతలు కర్నాటి పూర్ణచంద్రరావు, హెచ్‌ఎం వాణీశ్రీ, ఫిజియో థెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని, రవికిషోర్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉపకరణాలు అందజేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు